క్లుప్తంగా

నేడు చుండూరుకు విజయసాయిరెడ్డి రాక..

వలివేరు(వేమూరు): చుండూరు మండలం వలివేరు గ్రామంలోని సీతారామ కల్యాణ మండపంలో వలంటీర్లు, గృహ సారథులు, గ్రామ సచివాలయం కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులతో శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అన్నపరెడ్డి రఘురామి రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రీజినల్ కో-ఆర్డినేటర్ ఎంపీ వి.విజయసాయి రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని తెలిపారు.

నేడు పెదమట్లపూడిలో 'గడప, గడపకు మన ప్రభుత్వం'

నగరం: పెదమట్లపూడి గ్రామ సచివాలయ పరిధిలో మహ్మదీయపాలెం, రెడ్లపాలెం గ్రామాలలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు, గ్రామ వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

నేడు చెరుకుపల్లి, కనగాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

చెరుకుపల్లి: మండలంలో ఆధార్ శిబిరాల ద్వారా ఇప్పటి వరకు 55మంది ఆధార్లు అప్‌డేట్ చేసినట్లు ఎంపీడీవో బి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. శుక్రవారం చెరుకుపల్లి, కనగాల గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓట్ల తొలగింపుపై ఇంటింటి సర్వే
ఆర్డీవో ప్రభాకరరెడ్డి

పెదనందిపాడు: గతంలో తొలగించిన ఓట్లుపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు గుంటూరు ఆర్డీవో ప్రభాకరరెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం పెదనందిపాడులో తొలగించిన ఓట్లపై ఆయన సర్వే చేపట్టారు. 2022 జనవరి నుంచి ఇప్పటి వరకు తొలగించిన ఓట్లను ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. నిబంధనలు పాటించకుండా.. ఎవరి ఓటు అయినా తొలగిస్తే.. వాటిని పరిశీలించి, న్యాయం చేస్తామని ఆర్డీఓ చెప్పారు. బీఎల్‌వోలు నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారా.. లేదా తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. తహసీల్దారు సుభాని, ఆర్ఐ మల్లేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తెనాలి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అధికారులు సీజ్ చేశారు. ఎటువంటి బిల్లులు లేకపోవడంతో తెనాలి మండలం సోమసుందరపాలెం వద్ద ట్రాక్టర్‌ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏ.వి.చలం, సిబ్బంది గురువారం గుర్తించారు. వాహన యజమానిపై కేసు నమోదు చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు.

పూల మార్కెట్లో తనిఖీలు



నెహ్రూనగర్: వ్యాపారస్తులు తప్పనిసరిగా లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా స్టాంపింగ్ వేయించుకున్న తర్వాతే తూకాల్ని వాడాలని ఆ శాఖ డెప్యూటీ కంట్రోలర్ షాలేం రాజు తెలిపారు. స్టాంపింగ్ వేయించకుండా వ్యాపారం చేసే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా వినియోగదారులు ఎక్కువగా పూలు కొంటున్న నేపథ్యంలో గురువారం మార్కెట్లో తనిఖీ నిర్వహించారు. స్టాంపింగ్ నిబంధన పాటించని ఐదుగురు వ్యాపారస్తులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి




తెనాలి అర్బన్: విప్లవ గాయకుడు, రచయిత గద్దర్ సంతాప సభను బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో గురువారం తెనాలిలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థిగా ఉన్నప్పుడు గద్దర్ విప్లవ భావాలకు ఆకర్షితుడయ్యాడని తెలిపారు. సమాజం మార్పు కోసం ఉద్యోగాన్ని వదిలేసి గేయ రచయితగా గాయకుడుగా మారి, అట్టడుగు వర్గాల్లో చైతన్యం తీసుకువచ్చారని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చేరువై అనేక ఉద్యమాలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ కుర్రా సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు కాళిదాసు వెంకటేశ్వరరావు, ఎస్.ఆర్.కె. శర్మ, నరసింహారావు, మునిపల్లి వంశీ పాల్గొన్నారు.

రైతులకు వెన్నెముకలా నిలిచిన ఆర్‌బీకేలు

- రైతు ముంగిటకే వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం
- విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అండ..
- కర్లపాలెంలో 15 ఆర్‌బీకేల ద్వారా రైతులకు సేవలు



పేరలి రైతు భరోసా కేంద్రం





రైతులకు వేరుశనగ మినీ కిట్‌లు అందజేసిన జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్, ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి(ఫైల్)

కర్లపాలెం: వ్యవసాయ రంగంలో ఎన్నో ఒడిదుడుకులను రైతులు ఎదుర్కొంటూనే ఉన్నారు. ఆరుగాలం శ్రమించి సాగుచేస్తున్న రైతులకు నష్టాలే తప్ప లాభాలు రాని పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల రైతులు ఒడ్డుకు చేర్చేందుకు, సాగులో లాభాల బాట పట్టించేందుకు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతన్నలకు వెన్నుదన్నుగా ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామ స్థాయిలో తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటంతో పాటు సాగులో లాభాలు కళ్లచూసేలా రైతులకు శ్రేయోభిలాషిలా మారాయి. వారి మోములో చిరునవ్వులకు కారణమవుతున్నాయి.

గతంలో రైతులు వ్యవసాయ సబ్సిడీ పథకాలు, విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రానికి లేదా మార్కెట్ యార్డులకో వెళ్లాల్సి వచ్చేది. అధికారుల చుట్టూ తిరిగినా కాలయాపన జరుగుతూ సకాలంలో రైతులకు తగిన సాయం అందేది కాదు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతన్నకు తోడుగా నిలిచి, వ్యవసాయాన్ని పండగ చేయాలని గ్రామాలలో సచివాలయాల పరిధిలో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు చేశారు.

- రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావలసిన సాంకేతిక పరిజ్ఞానం, విత్తనాలు అందించటం దగ్గర నుంచి పంట సక్రమంగా చేతికంది వచ్చేంత వరకు సరైన సలహాలు, సూచనలు అందిస్తూ.. రైతుల పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించి, దళారి వ్యవస్థను నిరోధించి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి, రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తోంది.
- రైతులు సాగు చేస్తున్న పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేయటం సవ్యంగా విక్రయించుకునేందుకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టం జరిగినప్పుడు పంట నష్ట పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా తగిన చర్యలు తీసుకుంది.
- ఆర్బీకేల ద్వారా మట్టి నమూనాలు సేకరించటం, విత్తన శుద్ధి చేయించటం భూమి తత్వాన్ని బట్టి ఏ పంటలు వేయాలో ఆర్బీకే సిబ్బంది రైతులు సూచిస్తున్నారు.
- క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు పైర్లను పరిశీలించి, చీడపీడల నివారణకు సరైన సూచనలు సలహాలు అందిస్తున్నారు. వ్యవసాయ పనులు సులభంగా చౌకగా చేసేందుకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా సబ్సిడీ ధరలకే రైతులకు అందిస్తోంది.

సబ్సిడీలో రోటోవేటర్ తీసుకున్నాను



రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలపై అవగాహన కలిగింది. వ్యవసాయ సబ్సిడీ పథకంలో సీహెచ్‌సీ గ్రూపు ద్వారా రోటోవేటర్ తీసుకున్నాను. రూ.34వేల సబ్సిడీ వచ్చింది. రోటో వేటర్ ద్వారా రైతుల పొలాలు దున్నుతున్నాను.

– డి.సత్యనారాయణ స్వామిరెడ్డి, రైతు, దుండివారిపాలెం.

నాలుగేళ్లుగా రైతు భరోసా నగదు అందుతోంది



గతంలో వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేసేవాడిని. వైఎస్ జగన్ సీఎం అయినాక సాగు చేసేందుకు ముందుగానే వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రూ.13,500లు పలు దఫాలుగా మా చేతికందిస్తున్నారు. మేము పండించిన ధాన్యం కూడా ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి, నగదు మా ఖాతాకు వేస్తోంది.

– బుర్ల శివప్రసాద్, రైతు, కర్లపాలెం.

ఆర్‌బీకేల ద్వారా రైతుల్లో చైతన్యం



ప్రభుత్వం గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన తరువాత రైతులలో చాలా చైతన్యం వచ్చింది. సాగులో వారికి ఎదురయ్యే ప్రతి సమస్యకు వ్యవసాయాధికారుల సూచనలు అడిగి తెలుసుకుంటున్నారు. పొలం బడుల ద్వారా క్షేత్ర స్థాయిలో రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల వినియోగం కూడా ఘననీయంగా పెరిగింది.

– సుమంత్‌కుమార్, వ్యవసాయాధికారి, కర్లపాలెం.

ఉపాధి కల్పనే పీఎం విశ్వకర్మ పథకం లక్ష్యం



పీఎం విశ్వకర్మ పథకం పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ లలితకుమారి

భట్టిప్రోలు: ఉపాధి మార్గాలను సృష్టించడం ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం ప్రాథమిక లక్ష్యమని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పీఎం విశ్వకర్మ పథకంపై ఏపీ వడ్రంగి అసోసియేషన్ వేమూరు నియోజకవర్గ కన్వీనర్ కోడూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పథకం కింద 18 సంప్రదాయ వృత్తులలో ప్రత్యేకత కలిగిన కళాకారులను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఎంపీపీ లలితకుమారి మాట్లాడుతూ విశ్వకర్మల కోసం ప్రధాని మోదీ ప్రవేశ పెట్టిన ఈ పథకంలో భాగంగా అందరూ గుర్తింపు కార్డులు తీసుకుని, రుణ సదుపాయం పొంది ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, చోడవరపు గౌరీ భవాని, కిర్లంపల్లి పార్వతీ, చెరుకూరు శ్రీనివాసరావు, జాలాది పవన్, కన్నెగంటి చెన్నకేశవ, వెల్లటూరి దివాకర్, క్రాప రవికుమార్, లంకా విజయ భాస్కర శాస్త్రి, చోడవరపు వెంకటేశ్వరావు, నూతలపాటి రామకృష్ణ, కిర్లంపల్లి నాగేశ్వరావు, కోడూరు కాశీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీ పూజ



రేపల్లె: పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రైలుపేట రామకృష్ణ విద్యా నిలయంలోని సరస్వతీ అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు అమ్మవారికి పూజలు చేయించారు. పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం మహిళలు మణిద్వీప వర్ణన, లలితా సహస్ర నామ పారాయణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ కార్యదర్శి అన్నవరపు శ్రీనివాసరావు, సభ్యులు బొలిశెట్టి రామచంద్ర, మంజుల, మద్ది పద్మజ, బదరీనారాయణమూర్తి పాల్గొన్నారు.

జయహో భారత్...జయహో ఇస్రో





రేపల్లె రూరల్: చంద్రయాన్-3 చంద్రునిపై సురక్షితంగా ల్యాండ్ అయిన సందర్భంగా పట్టణంలోని భాష్యం స్కూలు విద్యార్థులు గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక స్కూలు నుంచి తాలూకా సెంటరు వరకు ర్యాకెట్‌లు, జాతీయ జెండా చేతబూని జయహో భారత్, జయహో ఇస్రో అంటూ పుర వీధుల్లో నినాదాలు చేశారు. కార్యక్రమంలో జోనల్ అధికారి హృదయరాజ్, ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, హెచ్‌ఎం ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ..

బాపట్ల: చంద్రయాన్-3 విజయవంతం కావటంతో బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం ప్రదర్శన చేపట్టారు. 22 ఆంధ్ర బెటాలియన్ సుబేదార్‌మజార్ మనోజ్ ప్రారంభించారు. ప్రిన్సిపల్ భవానీదేవి, కె.పద్మజ, కత్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

- మురుకొండపాడులో పర్యటించిన డీఎంహెచ్ఓ విజయమ్మ
- ప్రత్యేక వైద్య శిబిరం పరిశీలన, గ్రామస్తులకు సూచనలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టరు విజయమ్మ, ఆర్డీఓ జి.రవీంద్రబాబు

బాపట్ల: మురుకొండపాడు గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆర్డీఓ గంధం రవీంద్రబాబు, జిల్లా వైద్యాధికారిణి డాక్టరు విజయమ్మ గురువారం పరిశీలించారు. గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించి, గ్రామస్తులతో మాట్లాడారు. వెదుళ్ళపల్లి వైద్యాధికారిణి వైష్ణవికృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరంలోని మందులు, టెస్ట్ కిట్లను పరిశీలించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో ఇంటింటి సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిణి డాక్టరు విజయమ్మ మాట్లాడుతూ ప్రజలు కాచి చల్లార్చిన, క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని సూచించారు. జర్వబాధితులు అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఆర్డీఓ జి.రవీంద్రబాబు గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ దాసరి రాంబాబు, జిల్లా మలేరియా అధికారి వై.రాజకుమార్, డీఎల్ఓ శరత్‌బాబు, తహసీల్దారు సుధారాణి, వీఆర్ఓ విజయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు జాగుంట రాంబాబు, ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, పవన్‌కుమార్, పీహెచ్ఎన్ పద్మావతి, హెచ్‌వీలు రెబ్బకా, మీనాకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

తెనాలి: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ ఆధ్వర్యంలో పాత ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న రక్త నిధి కేంద్రంలో సివిల్ పనులకు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ శంకుస్థాపన చేశారు. రెడ్‌క్రాస్ తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి ఆధ్వర్యంలో రూ.72 లక్షల వ్యయంతో ఈ పనుల్ని చేపట్టారు. దసరా నాటికి రక్తనిధి కేంద్రం ప్రారంభించనున్నట్టు భానుమతి చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాల్సినపుడు గుంటూరు, విజయవాడకు వెళ్లాల్సిన పనిలేకుండా అవసరమైన రక్త యూనిట్లను రక్తనిధి నుంచి పొందే అవకాశం ఉందని తెలిపారు. రక్తం అవసరమైన రోగికి, చికిత్స చేస్తున్న వైద్యుడు సిఫార్సు చేసిన గ్రూపు రక్తాన్ని ఇక్కడ అందించే ఏర్పాట్లు ఉంటాయని మున్సిపల్ వైస్ చైర్మన్, ఆ వార్డు కౌన్సిలరు మాలేపాటి హరిప్రసాద్ చెప్పారు. రక్తకేంద్రానికి స్థలం కేటాయించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పావనీ ప్రియాంక, డాక్టర్ బీబీజాన్, 13వ వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత, రెడ్‌క్రాస్ కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ, ఈసీ సభ్యుడు కుర్రా శ్రీను, జవ్వాజి శ్రీను, సాయి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'విజ్ఞాన్'లో బయోటెక్నాలజీ కోర్సు ప్రారంభం



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో పీజీ డిప్లమో ఇన్ బయోటెక్నాలజీ కోర్సును ప్రారంభిస్తున్నామని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. కోర్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. బీఎస్సీ లైఫ్ సైన్సెస్ (బోటనీ, జువాలజీ, మైక్రో బయోలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ) పూర్తిచేసిన విద్యార్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మారుతున్న ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా బీఎస్సీ పూర్తిచేసిన విద్యార్థులను తీర్చిదిద్దటానికే ఈ కోర్సును డిసెంబర్ నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వివరాలకు 90003 90204, 80199 63972 సంప్రదించవచ్చని తెలిపారు. ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగనన్న పాలన

- రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు
- గరువుపాలెం పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు పాలన అందిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని గరువుపాలెం పంచాయతీ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా గరువుపాలెం, కొత్తకూచినపూడి, పిల్లలవారిపాలెం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. అర్హులకు ఎవరికైనా సంక్షేమ పథకాలు అందడం లేదా అనే విషయాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంతర్గత రోడ్లు, పలు సమస్యలను స్థానికులు ఎంపీ మోపిదేవి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మోపిదేవి హరనాథబాబు, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, అరవ కస్తూరి, శంకరరావు, ప్రభాకర్, సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

భూ సర్వేకు ప్రజలు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ విజయసారథి



వివరాలు సేకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ విజయసారథి, సిబ్బంది

రేపల్లె: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మీ భూమి-మా హామీ సర్వేకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ విజయసారథి కోరారు. పట్టణంలోని 17వ వార్డులో గురువారం నిర్వహించిన సర్వేను ఆయన పర్యవేక్షించారు. సర్వే అధికారులకు గ్రామస్తులు సహకరించి, తమ భూములను క్రమ బద్ధీకరించుకొని శాశ్వత భూ రికార్డులు పొందాలని తెలిపారు. సర్వేతో భూ యజమానులకు ఖచ్చితమైన హద్దులు చూపటంతో పాటు శాశ్వత రెవెన్యూ భూ రికార్డులలో నమోదు చేయటం జరుగుతుందన్నారు. దీంతో భవిష్యత్తులో భూ వివాదాలు, ఇతర వివాదాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు చోటు చేసుకోవని వివరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

- మృతుడు బిహార్ వాసిగా గుర్తింపు
- కేసు దర్యాప్తు చేస్తున్న పట్టణ పోలీసులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పట్టణ ఎస్ఐ షేక్ రఫీ



మృతిచెందిన అభ్‌దేష్ మంజీ

బాపట్లటౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని చీలురోడ్డు సమీపంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ షేక్ రఫీ కథనం మేరకు.. బిహార్‌లోని దేందహా జిల్లా, దరియాపూర్‌కు చెందిన అబ్‌దేష్ మంజీ (22) పట్టణంలో కొంత కాలంగా చేతివృత్తులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం చీలు రోడ్డులోని రాములవారి దేవాలయం సమీపం నుంచి కొత్త బస్టాండ్ వైపు వస్తుండగా అదే సమయంలో పాత బస్టాండ్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు పోలీసులు తరలించారు. పట్టణ ఎస్ఐ రఫీ కేసు నమోదుచేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

పంట నష్టపరిహారంలో అవకతవకలపై విచారణ



సచివాలయంలో జాబితాను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ డీడీ విజయనిర్మల

రేపల్లె రూరల్: మండలంలోని బేతపూడి, వేజళ్లవారి లంక గ్రామాలలో గత రబీ సీజన్‌లో మొక్కజొన్న పంట నష్ట పరిహారం ఎంపికలో జరిగిన అవకతవకలపై విచారణ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల చెప్పారు. బేతపూడి సచివాలయంలో గురువారం ఆమె పంట నష్టపరిహారం రికార్డులు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. పరిహారం పంపిణీలో అవకతవకలు జరిగాయని వస్తున్న ఆరోపణలపై విచారణ చేస్తున్నామన్నారు. జాబితాలను పరిశీలించటంతో పాటు రైతులతో మాట్లాడి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల, రేపల్లె ఏడీఏలు ఎప్రోయం, అక్తర్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు వాసి గుళ్లపల్లిలో మృతి

చెరుకుపల్లి: కొంతకాలంగా ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్న పెయింటర్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గుళ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వై.సురేష్ వివరాల మేరకు.. నరహరి శెట్టి కిషోర్(42) అనే వ్యక్తి ఎనిమిది నెలలుగా గుళ్లపల్లి జెండాచెట్టు సమీపంలోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటుంటున్నాడు. పెయింట్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అతను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పట్టించుకునే వారు లేక బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడు లభించిన ఆధారాల మేరకు.. గుంటూరులోని నాగేశ్వరరావు విధికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. తండ్రి రాధాకృష్ణగా సమాచారం. మృతుడి బంధువులు వివరాలు తెలియరాలేదని, ఎవరూ రాకపోవటంతో స్థానిక వీఆర్‌వో రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు ఉంటే వివరాలకు 94409 00874, 49907 96166, 08648-247233 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.